# దొంగలు

పట్నానికీ, మా వూరికీ సుమారు మూడుమైళ్ళ దూరం వుంటుంది. సాధారణంగా పట్నం వెళ్ళడానికి సైకిలు వాడే అలవాటు నాకు లేదు. యెప్పుడో అంత అర్జంటయితే తప్పించి. నడుస్తూ వెళ్ళి రావడమే యెంతో సరదాగా వుంటుంది. నాతోపాటు, యెవరో ఒహరు యెప్పుడూ వుంటారు గాబట్టి, మాటా మంతీ, ఆడుకుని పోవడం పరిపాటయ్యింది.

ఆ రోజు పట్నం వెళ్తుంటే, రాజారావు నాతో బైలుదేరాడు. బ్యాంకునించి ఓ అయిదు వేల రూపాయలు విత్‌డ్రా చేసి తీసుకురావల్సి వుంది గాబట్టి, జిప్‌బ్యాగ్ కూడా పట్టుకున్నాను. రాజారావు వెంట వుంటాడని, మరెవర్నీ తీసుకుపోలేదు.

బ్యాంకునించి డబ్బు తీసుకుని, మిగతా మరికొన్ని పనులు ముగించుకునేసరికి, సాయంత్రం అయిదు దాటింది. ఎండ తగ్గినా, వేడిగాలి మాత్రం వీస్తూనే వుంది.

నాగేశ్వర్రావు నటించిన 'బంగారు బాబు' చిత్రం విడుదలై వారం రోజు లయ్యింది. ఎక్కడ చూసినా, ఆ చిత్రం తాలూకు స్టిల్సే గోడల మీద ఆకర్షణీయంగా అగుపిస్తున్నయ్. నా అభిమాన నటుల్లో నాగేశ్వ ర్రావు ఒహడు గాబట్టి, ఆ చిత్రం చూసి వెళ్తే బావుంటుందేమోనన్న ఆలో చన తళుక్కున మెరిసింది. కాని, వెంటనే గుర్తు కొచ్చింది. ఇంత డబ్బు దగ్గర పెట్టుకొని, సినిమాకి వెళ్ళడం, ఆ రాత్రి పూట మా వూరు వెళ్ళడం శ్రేయస్కరం కాదని.

ఒక వ్యక్తి ఆలోచనలు, యెదురుగా వున్న వ్యక్తి మస్తిష్కంలోకి ప్రసారమౌతాయో యేమో తెలీదు గాని, అదే సమయంలో రాజారావు అన్నాడు, "రామారావుగారూ, బంగారు బాబు' చూచి వెళ్దామండీ" అని.

రాజారావు నా కంటె వయస్సులో రెండు మూడేళ్లు పెద్దవాడే అయినా, మా అంతస్తునిబట్టి, నన్ను బహువచనంలో సంబోధిస్తూ వుంటాడు; ఇది మొదట్నుంచీ అతనికి అలవాటే.

"సరిగ్గా యిదే ఆలోచన నాకూ వచ్చింది రాజారావ్. కాని, ఒక్కటే అడ్డొస్తున్నది," అన్నాడు.

"ఏవిటండీ?"

"మరేం లేదు ...నా దగ్గర యింత డబ్బు పెట్టుకుని సినీమాకి వెళ్ళడం, ఆ రాత్రి పూట మన వూరికి బైలుదేరడం, ప్రమాదకరమేమో." నని భయాన్ని వ్యక్తం చేశాను.

రాజారావు తేలిగ్గా ఓ నవ్వు నవ్వేడు. "మీ లాంటి వ్యక్తి యిలా అనడం, నాకు నవ్వొస్తోందండీ రామారావుగారూ! మనం యెన్నిసార్లు రాత్రి పూట మన వూరు వెళ్ళలేదు! ఆ త్రోవ మనకి కొత్తదేం కాదు. అందులోనూ, వెన్నెల రాత్రులాయె! చల్లని వేళ, సరదాగా కబుర్లు చెప్పు కుంటూ వెళ్ళిపోవచ్చు. సినీమా చూసి వెళ్దామండీ!" అన్నాడు, మొదట్లో నాలో మెదిలిన కోరికను బలీయం చేస్తూ.

నేను, కాదనలేకపోయాను.

'సరే! హాలు దగ్గరికి పద....' అంటూ ముందుకి సాగాను.

పెద్ద తరగతి టిక్కెట్లకోసంకూడా జనం కొట్టుకుంటున్నారు. ఈ సినీమా పిచ్చి, అన్ని నిషాలకంటె పెద్ద 'నిషా' అనిపించిందప్పట్లో.

రాజారావు ఆ దొమ్మిలోకి వెళ్ళి, బట్టలు నలుపుకొని, రెండు టిక్కెట్లు తీసుకుని, వీరుడిలా బైటికొచ్చాడు.

ఇద్దరం హాల్లో కూచున్నాం. చిత్రం చూస్తున్నంతసేపూ విసుగనిపించలేదు. నా జిప్‌బ్యాగ్‌నీ ఎంతో పదిలంగా పట్టుకున్నాను. దృష్టి, సినిమామీదున్నా, ఆలోచన మాత్రం జిప్‌బ్యాగ్ గురించే!

సినిమా విడిచిపెట్టేసరికి, తొమ్మిదింబావు అయ్యింది. ఆలస్యం చెయ్యకుండా, ఇరువురం అడ్డుత్రోవన బైలుదేరాం మావూరికి.

వెండిపరిచినట్టుగా, తెల్లనివెన్నెల కాస్తోంది. శరీరానికి హాయి గొలిపే చల్లనిగాలి వీస్తోంది. ఆ వాతావరణంలో నడవడమే యెంతో ఉల్లాసాన్ని కలిగించింది. త్రోవపొడుగునా సినిమాలోని సంఘటనల్ని గురించే మాట్లాడుకుంటూ సాగిపోతున్నాం.

కాలవ దాటాం. ఎదురుగా కాస్తంత దూరంలో గుబురుగా, ఓ పెద్ద రాక్షసి కూచున్నట్టుగా అనుపిస్తోన్న జీడితోట మనస్సులో కాస్తంత పిరికితనాన్ని రేకెత్తించింది. సాధారణంగా దొంగతనాలు, దోపిడీలు, ఆ తోటలోనే జరుగుతూ ఉంటాయ్. మామూలు రోజుల్లో అయితే, నిర్భయంగా ఉండేవాడ్ని. కాని, ఆరోజు నా దగ్గర అయిదువేల రూపాయలున్నాయి. నిజం చెప్పొద్దూ నాకు గుండెల్లో ఒక విధమైన దడ ప్రారంభమయ్యింది.

'రాజారావ్. జీడితోట దగ్గర మనం కాస్తంత అప్రమత్తతతో ఉండాలోయ్....' అన్నాను.

రాజారావు నవ్వేడు. ఆ క్షణంలో అతని నవ్వుని నేను హర్షించలేకపోయాను. ఒకవేపు నాకు గుండెల్లో గుబులుగావుంటే, అతనికి నవ్వొస్తోందా?

'నవ్వుతా వేవిఁటోయ్?' అన్నాడు కాస్తంత విసుగ్గా.

'మీరు ఇంత పిరికివారా! నాకు ఇంతవరకూ తెలీదు రామారావుగారూ: ఈ ప్రాంతంలో మిమ్మల్ని ఎరుగని వాడెవడండీ! మిమ్మల్ని దోచుకోడానికి, ఎవడికయినా గుండెలుండొద్దూ?' అన్నాడు.

నాలో కాస్తంత ధైర్యం పుంజుకుంది. ముందుకి సాగిపోయాం.

జీడితోట మధ్యగా నడుస్తున్నాం. కీచురాళ్ళ ధ్వని స్పష్టంగా

వినిపిస్తోంది. గాలికి యెండుటాకులు రాలిపడుతున్న శబ్దం. అస్పష్టంగా వినవస్తోంది.

'ఆగండి....' గంభీరమైన గొంతు వినిపించింది.

నిజంగానే నేను భయంతో వొణికిపోయాను. ఆ రాత్రికి పట్నంలో ఉండిపోయినా బాగుండిపో ననిపించింది. కాని ఇప్పుడు అనుకొని ఏం లాభం! వొణుకుతోన్న చేతి వ్రేళ్ళతో జిప్‌బాగ్‌ని మరింత గట్టిగా అదిమి పట్టుకున్నాను.

'రాజారావ్....' వొణుకుతున్న స్వరంతో మెల్లగా అన్నాను.

'ఎవరై ఉంటారు చెప్మా' అని ఆలోచనల్లో పడ్డాడు రాజారావు.

నల్లని ఆకారం మావేపు వస్తోంది. ఆ ఆకారం దగ్గర పడుతున్న కొద్దీ, నా గుండెలు మరింత జోరుగా కొట్టుకోవడం ప్రారంభించాయి. ఆ వ్యక్తి నా దగ్గరగా వొచ్చి, మొహంలోకి చూశాడు. వెన్నెల రాత్రుళ్ళు గాబట్టి నా మొహం గుర్తు పట్టగలిగాడోయేమో.

దండాలు బాబయ్యా! తవ(రా! ఈ రాత్రేళ ఇట్టా వస్తుండారెందుకు బాబయ్యా!' అన్నాడు వినయంగా.

నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. 'నేను నిన్ను గుర్తుపట్ట లేదోయ్....' అన్నాను.

'నేను బాబయ్యా, చలమయ్యా?'

చలమయ్య పేరు నాకు సుపరిచితమే! వాడు పెద్ద దొంగని, మా నాన్న చెప్తూండేవారు. వూళ్ళో అందరికీ, వాడి గురించి తెలుసు. వాడు చాలాసార్లు జైలుకెళ్ళి వచ్చాడు. అయితే, వాడిలో ఒక సుగుణంవుందని మానాన్న అంటుండేవారు. తెలిసున్న వాళ్ళని వాడు దోచుకోడు. ఆ నిజాయితీ వాడిలో వుంది. నాకు ధైర్యం వచ్చేసింది.

'నువ్వా చలమయ్యా' అర్జంటు పనుండి పట్నంలో ఇంతవేళవరకూ ఉండిపోవల్సి వచ్చిందోయ్. నువ్వు గాబట్టి సరిపోయింది. మరింకెవరైనా అయితే, మా గతేం కాను?' అన్నాను.

'రోజులేం బాగోలేవు బాబయ్యా' ఇయ్యాల వచ్చే సేరుగాని, ఎప్పుడూ ఇంక రాత్రిపూట ఈ త్రోవన రాకండి. పాతరోజులు కావు

బాబూ! మారిపోనాయి. పదండి బాబయ్యా. తమరితోపాటు అల్లంతదూరం వత్తాను....' అన్నాడు చలమయ్య.

చలమయ్య దొంగే అయినా, వాడిలో ఉండే నీతికీ, సహృదయతకూ, మనసులో జోహారు లర్పించాను, అంతలో రాజారావు కోపగించుకున్నాడు.

'ఎందుకులే చలమయ్యా, ఇద్దరం ఉన్నాంగా! వెళ్ళిపోతాం అన్నాడు.

చలమయ్య మాత్రం వినిపించుకోలేదు. 'మీకు తెల్దు బాబయ్యా కరువు పెరిగిపోతావుంటే, మనుషుల్లోనూ డబ్బుకోసం యావ పెరిగిపోతావుంది. ఈమధ్య శానామంది దొంగతనాలు నేర్చినారు. ఎవరి బుద్ధి ఎట్టాగుంటాదో, ఎవరికి తెల్సు? అందాకా వస్తాను, పదండి బాబయ్యా' అంటూ మాముందే నడిచాడు.

నేనేం మాటాడలేకపోయాను. నా మెదడులో ఆలోచనలన్నీ చలమయ్యను గురించే. దొంగల్లో కూడా చలమయ్య లాంటి వ్యక్తు లుంటారని, యెప్పుడూ వూహించలేదు.

'పెద్ద ప్రమాదం తప్పింది రాజారావ్....' అన్నాను మెల్లగా.

'ఔనండి,' ముక్తసరిగ అనేసి వూరుకున్నాడు, రాజారావు.

నేను యేం చెబుతున్నా, 'వూ' కొడుతున్నాడే తప్పించి, మరేం మాట్లాడలేదు రాజారావు. నాకు ఆశ్చర్యమేసింది.

'ఏవిటి రాజారాజావ్, అంత పరధ్యానంగా వున్నావు?' వుండబట్టలేక అడిగాను.

కాస్తంత తడబడ్డాడు రాజారావు, 'అబ్బే; ఏవీఃలేదండీ, మనల్ని అటకాయించిన వ్యక్తి, చలమయ్యే కాకుండా వుంటే, మన పరిస్థితి యేవిటా అని ఆలోచిస్తున్నాను....' అన్నాడు.

'అదే నేనూ అనుకుంటున్నాను' అని నేను అన్నానో లేదో మామిడి చెట్ల చాటునించి ఓ నలుగురు వ్యక్తులు కర్రలతోవచ్చి మమ్మల్ని అడ్డారు.

నాకేం పాలుపోవడం లేదు. ఇవ్వాళ యెందుకిట్లా జరుగుతుందా అన్న ఆలోచనలతో, నాకు మతి పోయినట్టనిపించింది.

చలమయ్య కూడా షాక్ తిన్నట్టున్నాడు.

'ఈ చలమయ్యని ఆపే మొనగాడెవడ్రా?' అంటూ మొల్లో దోపిన కత్తిని తీశాడు చలమయ్య.

చలమయ్య గొంతు సింహ గర్జనలా వినిపించేసరికి, ఆ నలుగురూ బెంబేలెత్తిపోయారు. కంగారుగా పరుగు లంకించుకున్నారు. చలమయ్య మెరుపులా వెళ్ళి, ఒకణ్ణి పట్టుకున్నాడు. ఎడాపెడా నాలుగు తగిలించేసరికి, వాడొచ్చి నా కాళ్ళమీద పడ్డాడు.

'రచ్చించండి బాబూ' అన్నాడు శరణుజొచ్చిన వాడిలా.

'బాబుగార్ని దోసుకోడాని కొచ్చార్రా?' మీ కెన్ని గుండెలుండాల్రా?' అన్నాడు చలమయ్య, వాడి జబ్బ పట్టుకుని పైకెత్తి.

వాడు వొణికిపోతూ,

'సెలమియ్యా, మా కా పుద్దేశం నేదు. ఇదిగో, ఈ రాజారావ్ బాబే మాకు పురమాయించారు. రామారావుగోరు యియ్యాల డబ్బు తీసుకుని పట్నంనించి ఘస్తారని, ఆయన్ని అడ్డగించి, ఆ డబ్బు కాజెయ్యమని సెప్పారు. మాకు సెకో వందా యిస్తామన్నారు.... బుద్ధి గడ్డి తిని వప్పుకున్నాం....' అన్నాడు.

నిర్ఘాంతపోయాన్నేను. ఇది నిజమేనా? .... అనిపించింది. నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. సినీమా చూసి పోదామని రాజారావు పురమాయించిన వైనం, చలమయ్యని తమతో రావొద్దని వారించిన విషయం గుర్తుకొచ్చాయి. ఓ పురుగును చూసినట్టుగ రాజారావుకేసి చూశాను. అయితే, రాజారావు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్న ప్రయత్నం చేశాడు. ఆ దొంగకేసి పురుముతూ వెళ్ళి....

'నోర్మూయ్‌రా వెధవా! నువ్వెవడవో నాకు తెలీదు, నిన్ను నేను పురమాయించడ మేవిఁటి? నోటికొచ్చినట్టంతా పేలితే, నాలుక పీకిం చేస్తాను, తెలుసా?' అన్నాడు వుక్రోషంతో.

'రాజారావ్, అబద్ధాలు చెప్పి నిన్ను నువ్వు కాపాడుకోడానికి యెందుకు ప్రయత్నిస్తావు చెప్పు? .... దొంగలే అయినా, వీళ్ళలో యెంత నిజాయితీవుందో, మనం చలమయ్యని ఉదాహరణగా తీసుకుని చెప్పొచ్చు. వాళ్ళకున్న నీతి, నిజాయితీ, నీకు లేకపోవడం శోచనీయం' అన్నాను కోపంగా.

'నన్ను అపార్థం చేసుకుంటున్నారు రామారావుగారూ! ఎవడో దొంగవెధవ చెప్పింది నిజంగా నమ్మేసి, పరిచయస్తున్నయిన నా మాట కొట్టిపారేస్తున్నారు. ఇది భావ్యంగా లేదు. వీడెవడో నాకు తెలీదు. నేను వీడికి చెప్పడమేవిఁటి?' అంటూ మళ్ళీ దొంగకేసి ఉరుముతూ చూసి 'నిజం చెప్పరా! కళ్ళు పీకేస్తాను....దొంగరాస్కెల్! అన్నాడు.

అయితే, ఈ పర్యాయం ఆ దొంగ నోరుమూసుకు వూరుకోలేదు.

'రాజారావుగోరూ, వూరుకుంటుంటే, మరీ నోరు పారేసుకుంటున్నారేటండి? సత్తె పెమాణంగా సెప్పండి - ఈరోజు తెల్లారేసరికి మా ఈరయ్య దగ్గరికొచ్చి మీరు సెప్పనేదుటండీ, రామారావుగోరు డబ్బుతో వస్తారు.... అర్ని దోసుకోమని. ఆ దొంగతనం సెలమయ్య మీదే తోసెయ్యొచ్చని మీరే సెప్పారు గదండీ? ఎందుకండీ అబద్ధం.... నిర్భయంగానే చెప్పాడు వాడు.

చలమయ్య 'కఁయ్' మన్నాడు. వాడికి ఈసారి నిజంగా కోపం వచ్చింది.

'ఎటేటీ? ఈ దొంగతనం నామీద తోసెయ్యడానికా? ఇదా బాబూ, మీయెత్తు? మిమ్మల్ని ఇడిసి పెట్టకూడదు. రామారావుగోరూ, తవఁరు సెలవిప్పించండి-ఈ బాబుని పచ్చడిచేసి పంపిత్తా. మరెప్పుడూ ఇల్లాంటి ద్రోహం తలపెట్టరీయన....' అన్నాడు కోపంగా.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో చలమయ్య స్వరం చాలాకటువుగా వినిపించింది. నిజంగా రాజారావుని పచ్చడి పచ్చడి చేస్తాడనిపించింది.

'ఎందుకులే చలమయ్యా! ఇటువంటివాణ్ణి కొట్టడం, నీకే చిన్నతనం. దొంగవని పేరువడ్డ నీలో ఉన్నపాటి నీతి, ఈ రాజారావుకి లేకపోయింది. కనీసం, ఈ సంఘటన జీవితాంతం గుర్తుంచుకుంటే, అతడికి అదేశిక్ష! నీ మేలు ఎన్నటికీ మర్చిపోను చలమయ్యా! ఇదిగో ఈ ఇరవై రూపాయలుంచుకో!' అంటూ రెండు పది రూపాయల నోట్లు తీసి చలమయ్యకి అందించాను.

కాని, చలమయ్య చప్పున తీసుకోలేదు. 'వద్దు బాబయ్యా? మీ ఉప్పు కారం ఎప్పుడూ తింటున్న వాళ్ళమే!' అన్నాడు.

'అయినా, నా తృప్తికోసం ఉంచుకో చలమయ్యా! డబ్బుకాదు ప్రధానం....మనిషి విలువ. కడుపు నింపుకోడానికి దొంగతనం చేస్తున్నావు గాని, నిజానికి నువ్వు దొంగవు కావు. సంఘంలో నీకంటె గొప్ప గొప్ప దొంగలు ఎంతోమంది వున్నారు. వస్తా...' అంటూ చలమయ్య చేతిలో ఆ డబ్బు పెట్టాను.

'వూరు చివరివరకూ వస్తాను పదండి బాబాయ్యా!' అంటూ నాతో పాటు వచ్చాడు, చలమయ్య.

రాజారావు వస్తోందీ, లేందీనాకు అవసరం లేకపోయింది. అటువంటి వ్యక్తితో ఇన్నాళ్ళూ పరిచయం ఉన్నందుకు, నాకే సిగ్గువేసింది. రాజారావు, ఆ దొంగ ఏదో ఘర్షణ పడుతున్నట్టు అస్పష్టంగా వినిపిస్తూ ఉంటే, నేను సాగిపోయాను. వూరు పొలిమేరలవరకూవచ్చి, చలమయ్య వెళ్ళిపోయాడు.

మరుచటిరోజు తెలిసింది. రాజారావు ఎక్కడికో వెళ్ళిపోయినట్టు. అయితేనేం-అతడిగురించి నేనంతగా పట్టించుకోలేను. రాత్రి జరిగిన సంఘటన గురించి కూడా ఎవరికీ చెప్పలేదు.

ఈ రోజుల్లో నిజమైన దొంగలు యెవరో గుర్తుపట్టడం కష్టమని, ఆ సంఘటన నాకు తెలియజేసింది. అందుకే, ఆ సంఘటన్ని ఎప్పటికీ మర్చిపోలేను.

✱ కానుక ✱